క్లుప్తంగా

సంతోషిమాత జయంతి ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో జూలై 3 నుంచి 5 వరకు సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సుకన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అర్చకులు కిరణ్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఉత్సవాలలో విశేష అర్చనలు, హోమాలు, కుంకుమ పూజలు జరుగుతాయని ఈఓ తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు కొర్రీలు తగదు



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గత ప్రభుత్వాల్లో అర్హత ప్రామాణికంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులకు ఎటువంటి ష్యూరిటీలు లేకుండా బ్యాంక్ అధికారుల ఆమోదంతో నేరుగా రుణాలు అందజేసేవారని, ఇప్పుడు కొత్తగా సిబిల్ పేరుతో అనర్హులను చేస్తూ కూటమి నేతలే రుణాలు దక్కించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పలుకుబడితో పైరవీలు చేసి అర్హత లేనివారికి రుణాలు అందించాలనే ఆలోచన సరికాదన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండే నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

జి.సిగడాం తహసీల్దార్‌గా సరిత



సరితను అభినందిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మండల తహసీల్దార్‌గా మహాదేవ్ సరిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నరసన్నపేట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎం.శ్రీకాంత్ మందస మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో మండల ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తానని చెప్పారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మల, ఆర్‌ఐ ఎ.రాధ ఉమా పట్నాయక్, సర్వేయర్ శాంతారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పుస్తకాల పంపిణీ



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ జనార్దనరావు

రణస్థలం: మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పాఠశాలలకు సకాలంలో చేరవేయాలని జిల్లా ఎస్ఎస్ఏ కో ఆర్డినేటర్ పి.జనార్దనరావు అన్నారు. జె.ఆర్.పురం ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలానికి 45,564 నోట్ పుస్తకాలు, 31,751 పాఠ్య పుస్తకాలు చేరాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బి.లావణ్య, మండల కో ఆర్డినేటర్ విజయ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఏపీసీసీబీఓఏ కార్యవర్గం ఎన్నిక



జగదీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విజయవాడలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీసీసీబీఓఏ) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్‌వీఎస్ జగదీష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రంగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌వీ సత్యనారాయణ, సలహాదారులుగా డి.వరప్రసాద్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం యూనిట్ ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

18న ఎమ్మెల్సీ గాదె అభినందన సభ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహన్‌రావు, కార్యదర్శి దానేటి కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి ఉపాధ్యాయులు, లెక్చరర్లు, అభిమానులతో పాతబస్టాండ్ మీదుగా జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పల్లెకు చేరని.. ప్రగతి రథచక్రాలు



జాడ - చీపురుపల్లి రహదారిలో ఆటోకు వేలాడుతున్న ప్రయాణికులు



పాగిరి -జి.సిగడాం సెంటర్‌లో బస్సుకు వేలాడుతున్న విద్యార్థులు (ఫైల్)

- కలగా మిగిలిన ఆర్టీసీ బస్సు సౌకర్యం
- ఉన్న సర్వీసులు కూడా రద్దు చేస్తున్న వైనం
- రహదారులు మెరుగుపడినా స్పందించని పాలకులు
- ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్న గ్రామీణులు

జి.సిగడాం: అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలగానే మిగిలిపోతోంది. ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పిస్తున్న ప్రజాప్రతినిధులు గద్దెనెక్కాక మాట మర్చిపోవడంతో గ్రామీణులకు ప్రైవేటు వాహనాలనే దిక్కవుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలు, ఇతర వాహనాల్లో కిక్కిరిసి ప్రమాదకర రీతిలో ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జి.సిగడాం మండలంలో 31 గ్రామ పంచాయతీలు 43 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో చెట్టుపొదిలాం, మధుపాం, బాతువ, పున్నాం, జాడ, జగన్నాథవలస, వెంకయ్యపేట, పెంట, నాగులవలస, వి.ఆర్.పేట, సీతంపేట, నక్కపేట, టంకాల దిగ్గువలస, నిద్దాం, అద్వానంపేట తదితర గ్రామాలకు ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రైవేటు వాహనాలే ఆధారమవుతున్నాయి.

రద్దు చేయడంతో పాట్లు..

జి.సిగడాం, గెడ్డకంచరాం, ఎందువ, ఎస్.పి.ఆర్ పురం మీదుగా ఒకేఒక్క బస్సు సర్వీసు ఉంది. అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. గతంలో శ్రీకాకుళం డిపో నుంచి పొందూరు, పాగిరి, జి.సిగడాం, జాడ, వెంకయ్యపేట, జగన్నాథవలస మీదుగా చీపురుపల్లి వరకు బస్సు నడిచేది. శ్రీకాకుళం నుంచి పొందూరు, మధుపాం, చెట్టుపొదిలాం, బాతువ మీదుగా చీపురుపల్లి బస్సు సర్వీసు ఉండేది. వీటిని రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు పట్టణాల్లోని విద్యాసంస్థలకు సకాలంలో చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు పాత సర్వీసులు పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



మారుమూల పల్లెల్లో ఉన్న విద్యార్థులకు ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఎటువంటి ప్రయాణం సదుపాయం లేదు. గతంలో జి.సిగడాం మండలానికి 5 బస్సులు నడిపేవారు. ప్రస్తుతం గెడ్డకంచరాంకు వెళ్లే బస్సు తప్ప ఏవీ అందుబాటులో లేవు. అధికారులు స్పందించి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలి.

– పెద్ది శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు, జాడ

వినతిపత్రాలు అందించినా..



మారుమూల గ్రామాల విద్యార్థులు ఉన్నత చదువులకు పట్టణాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించాం. తక్షణమే పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– బూటు అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు, బాతువ

సర్వీసు పునరుద్ధరించాలి..



శ్రీకాకుళం డిపో నుంచి పొందూరు, చెట్టుపొదిలాం, జి.సిగడాం, బాతువ మీదుగా బస్సు సర్వీసు నడిపేవారు. అనంతరం సర్వీసు రద్దు చేసేశారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సు సర్వీసును పునరుద్ధరించాలి.

– డబ్బాడ ఆదినారాయణ, సర్పంచ్, బాతువ

ఇబ్బంది పడుతున్నాం



శ్రీకాకుళం నుంచి రణస్థలం, పెనసాం, నడిమివలస, జి.సిగడాం మీదుగా రాజాం వరకు బస్సు సర్వీసు నడిపేవారు. ప్రస్తుతం నిలుపుదల చేయడంతో ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరలేకపోతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేశాం.

– తాళాబత్తుల పైడిరాజు, పెనసాం

అకౌంట్స్ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విధి నిర్వహణలో అలసత్వం సహించేది లేదని, ఉద్యోగాలంటే టైంపాస్ కాదని ఏ సమాచారం అడిగిన వెంటనే ఇవ్వాలంటూ అకౌంట్స్ సెక్షన్ సిబ్బందిపై మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో పలు విభాగాలను శుక్రవారం కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ విభాగం సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. రికార్డులన్నీ సక్రమంగా పూర్తిచేసి తన టేబుల్‌పై ఉంచాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ల బిల్లులు, అప్‌లోడ్ చేసిన వివరాలు, పెండింగ్ బిల్లుల వివరాలన్నీ తెలియజేయాలన్నారు. అనంతరం టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశమై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కమిషనర్‌తో పాటు ఆడిట్ అధికారి శివశంకర్, ఏసీపీ జానకీదేవి తదితరులు ఉన్నారు.

కార్మికులను సస్పెండ్ చేయడం తగదు



కార్మికులు, పరిశ్రమ ఉద్యోగులతో మాట్లాడుతున్న పోలీసులు

రణస్థలం: అక్రమంగా సస్పెండ్ చేసిన ఏడుగురు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రణస్థలం మండలం వరిసాంలోని శ్యాంపిస్టీన్స్ పరిశ్రమలో పనిచేస్తున్న ఏడుగురు కార్మికులు (యూనియన్ ప్రతినిధులు)ల అక్రమ సస్పెన్షన్‌పై పరిశ్రమ వద్ద సీఐటీయూ నాయకులు, కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు సకాలంలో చెల్లించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇటీవల కార్మికులు ధర్నా నిర్వహించారని, ఆ సమయంలో పరిశ్రమ హెచ్‌ఆర్‌పై ఈ ఏడుగురు దురుసుగా ప్రవర్తించారనే నెపంతో సస్పెండ్ చేశారని చెప్పారు. ఈ విషయాన్ని విశాఖ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 20న పరిశ్రమ యాజమాన్యం, కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని చెప్పినట్లు వారు చెప్పారు. కాగా, నిరసన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్సై ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులను మోహరించారు.

ఉమ్మడి కుటుంబమే మేలు

శ్రీకాకుళం అర్బన్: ఉమ్మడి కుటుంబంతో ఉంటే ఎంతో సంతోషం కలుగుతుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. నగరంలోని పెద్దబరాటం వీధిలో సంస్థ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్ బరాటం లక్ష్మణరావు నాటి రోజులను గుర్తు తెచ్చుకుని వారి కుటుంబ సభ్యులంతా శుక్రవారం ఒకచోటికి చేరారు. అనంతరం సంస్థ వైస్ చైర్మన్ నటుకుల మోహన్, ఇరవై ఆరు మంది కుటుంబ సభ్యులను సత్కరించారు.

నేడు జి.సిగడాంలో ప్రజాదర్బార్

జి.సిగడాం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరై సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

ఇదేం నిర్మాణం?

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బొందిలీపురం నుంచి గొలివి హాస్పిటల్‌కి వెళ్లే రోడ్డులో ఇటీవల కొత్తగా కాలువ నిర్మాణాలు చేపట్టారు. ఓ చోట విద్యుత్‌స్తంభం ఉన్నా కనీసం పక్కకు జరపకుండా కాలువ మధ్యలోనే ఉంచేసి నిర్మాణం పూర్తి చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కాలువ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

అరకొర జీతాలతో అవస్థలు

- ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు పెంచకపోవడం తగదు
- ప్రభుత్వం తీరుపై మున్సిపల్ ఇంజనీరింగ్ నాన్‌టెక్నికల్, టెక్నికల్ సిబ్బంది మండిపాటు
- కొనసాగుతున్న సమ్మె



శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు తాగునీరు, కాలువలు, మరుగుదొడ్ల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, డెత్, బర్త్ వంటి సర్టిఫికెట్లు జారీ, ప్రొఫార్మాల తయారీ తదితర అనేక పనులు చేస్తున్నా తమ సమస్యలు మాత్రం ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మున్సిపల్ కార్పొరేషన్ టెక్నికల్, నాన్‌టెక్నికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆవేదన చెందుతున్నారు. ఎన్నిసార్లు నిరసన వ్యక్తం చేస్తున్నా కనీసం స్పందించని ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. పురపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తున్నా.. తాము బతకడానికి తగిన వేతనం ఇవ్వకపోవడం దారుణమని వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా రెండో రోజైన శుక్రవారం కూడా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా కొనసాగించారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- కార్మికుల రిటైర్‌మెంట్ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి.
- నగర జనాభాకు అనుగుణంగా ఇంజనీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలి.
- పలువురు ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలి. సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలి.
- 15 ఏళ్లు పూర్తయిన వర్కర్లను క్రమబద్ధీకరించాలి. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సెలవులుగా ప్రకటించాలి. లేదా అందుకు తగ్గ వేతనాలైనా ఇవ్వాలి.
- విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షలు, అంగవైకల్యం చెందిన వారికి రూ.5లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కేటాయించాలి.
- హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలి. కార్మికులుగా ఉన్న అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

సమాన పనికి సమాన వేతనం..



మున్సిపాలిటీ పరిధిలో 16 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నా. చేతికొచ్చేది రూ.16 వేలే. చాలీచాలనీ జీతంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. పెరిగిన గ్యాస్, నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. జీతం పెంచడంతో పాటు మాకూ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

– జి.జయలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

ఆదుకోవాలి..



జీవిత కాలం ఉద్యోగం చేసి రిటైరయ్యాక కనీసం పెన్షన్ ఇవ్వకపోవడం అన్యాయం. విధుల్లో ఉన్నంతకాలం రెక్కలు ముక్కలు చేసి కష్టపడినా వచ్చేది అరకొర జీతమే. 1981లో రూ.690 జీతానికి చేరా. ఇప్పటికి రూ.18వేలకు చేరింది. రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచితే బాగుంటుంది. వచ్చే ఏడాది రిటైరవుతా. ప్రభుత్వం చొరవచూపి ఆదుకోవాలి.

– ఎం.చంద్రశేఖర్, ఫిట్టర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లను ఆనుకుని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా గాలులు, వర్షాలు సమయంలో బిక్కుబిక్కుమంటున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

అధ్వానంగా సర్వీసు రోడ్డు



కింతలిమిల్లు కూడలి నుంచి చిలకపాలెం వరకు జాతీయ రహదారి బైపాస్ సర్వీస్ రోడ్డు చాలా చోట్ల పాడైంది. ఎక్కడికక్కడ పెచ్చులూడుతున్నాయి. నిర్వహణ సక్రమంగా లేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

10 గంటల పుష్పం



శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి గ్రామంలో ఇప్పిలి సత్యనారాయణ నివాసంలో వాక్స్‌రోజ్ (కాక్టస్‌రోజ్) చెట్టు పూలు ప్రతిరోజూ సరిగ్గా ఉదయం 10 గంటలకు మాత్రమే పూస్తాయి. ఔషధ గుణం కలిగిన ఈ చెట్టును చూసేందుకు, వీటి పుష్పాలు కోసం పరిసర ప్రాంతవాసులు ఎగబడుతుంటారు.

- శ్రీకాకుళం రూరల్

సంక్షిప్తంగా..

ఉత్సాహంగా తిరంగా యాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, మాజీ సైనికులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం తిరంగా యాత్ర నిర్వహించారు. శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ వద్ద మొదలై జీటీ రోడ్డు మీదుగా కొనసాగింది. బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మాజీ సైనికులు, యువత పెద్దన హాజరయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్, పైడి వేణుగోపాలం, మాదారపు వెంకటేష్, డాక్టర్ పైడి సింధూర, పిసిని చంద్రమోహన్, శవ్వాన ఉమామహేశ్వరి, మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆర్ఎంగా ఉదయ్‌కుమార్‌సింగ్

శ్రీకాకుళం అర్బన్: భారతీయ స్టేట్ బ్యాంక్ శ్రీకాకుళం రీజనల్ మేనేజర్‌గా ఉదయ్‌కుమార్ సింగ్ నియమితులయ్యారు. ఈయన విశాఖ ఆర్ఎం కార్యాలయంలో ఏవో (హెచ్ఎల్ఎస్‌టీ)గా విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఆర్ఎంగా పనిచేస్తున్న అబ్దుల్ హసీద్ అమీర్‌ను విశాఖకు బదిలీ చేశారు.

భూగర్భజలాలు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని 46 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం ఆందోళన కలిగించే విషయమని తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. భూగర్భ జలాలు పెంపుపై ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందకాలు తవ్వడం, పూడికతీత పనులు, వ్యవసాయ క్షేత్రాల్లో కుంటలు తవ్వకం వంటి చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ ఆర్.సత్యవతి, శ్రీనివాసరావు, ఎంఈఓ ఎ.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

రణస్థలం: మండలంలోని 34 పంచాయతీల పరిధిలోని ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 130 మంది హాజరైనట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం 25 యూనిట్లకు గాను 149మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 125 దరఖాస్తులు వచ్చాయని ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. మండలానికి 23 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుడా ఎస్ఈ సుగుణాకరరావు

జి.సిగడాం: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా)ఎస్ఈ, ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రత్యేకాధికారి పాగిరి సుగుణాకరరావు సూచించారు. శుక్రవారం జి.సిగడాం మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వ్యవసాయం, పండ్ల తోటల పెంపకాలు, ఉపాధి, పాడి పరిశ్రమలతో పాటు ఇతర శాఖల ద్వారా మెరుగైన ఫలితాలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, తహసీల్దార్ ఎం.సరిత, వ్యవసాయాధికారి వై.శారద, అనూషా, వైద్యులు సుమన్, ఎంఈఓ-2 ముళ్ల శ్రీనివాసరావు, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెట్టవలసలో పారిశుద్ధ్య పనులు

జి.సిగడాం: మండలంలోని మెట్టవలసలో ఇటీవల గ్రామదేవత పండగలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అంటురోగాలు ప్రబలకుండా శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, చెత్తా చెదారం లేకుండా ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ బెవర విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పర్యవేక్షించారు.

వినతులు స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చిలకపాలేంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.